సాక్షి ప్రకాశం

బుధవారం । 25 । అక్టోబర్ । 2023



విజయానికి చిహ్నం.. విజయదశమి

విజయదశమి పర్వదినం సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయుధపూజ నిర్వహించారు. ఎస్పీ మలికాగర్గ్, వకుల్ జిందాల్ దంపతులు పాల్గొన్నారు.

- 8లో..



హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

మార్కాపురం పట్టణంలో నివాసం ఉంటున్న అర్ధవీడు హెడ్‌కానిస్టేబుల్ ఇంట్లో చోరీ జరిగింది. రూ.4 లక్షల నగదు, 55 గ్రాముల బంగారం చోరీ అయింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37.1/24

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పగటి పూట ఉక్కపోత అధికం.

న్యూస్‌రీల్

‘ధనలక్ష్మి’గా వాసవీ మాత



యర్రగొండపాలెంలో కరెన్సీ అలంకరణలో వాసవీ అమ్మవారు

యర్రగొండపాలెం: విజయదశమి పండుగ సందర్భంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం కమిటీ రూ.52 లక్షల కరెన్సీతో వాసవీ అమ్మవారిని అలంకరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మారుతీ కృష్ణ, ఎస్సై కోటయ్యల ఆధ్వర్యంలో పోలీసులు ఆయుధపూజ చేశారు. కొప్పుకొండపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ జమ్మిపూజ, పారువేట నిర్వహించారు.

సత్తాచాటిన అనంతపురం జిల్లా ఎడ్ల జతలు



ఆకవీడులో బండలాగుతున్న ఎడ్ల జతలు

రాచర్ల: మండలంలోని ఆకవీడు గ్రామంలో శిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెండు పళ్లసైజు ఎడ్ల బండలాగుడు పోటీల్లో అనంతపురానికి చెందిన బి.భావన ఎడ్ల జతలు సత్తాచాటాయి. ఈ ఎడ్ల పోటీల్లో మొత్తం 13 జతల ఎడ్లు పాల్గొనగా బి.భావన ఎడ్ల జతలు నిర్ణీత 20 నిమిషాల్లో 3250 అడుగులు లాగి మొదటి బహుమతి సాధించాయి. అదేవిధంగా వైఎస్సార్ జిల్లా కలసపాడు మండలం నల్లగుండుపల్లి గ్రామానికి చెందిన వల్లూరి రవీంద్రారెడ్డి ఎడ్లు 3201 అడుగులు లాగి రెండో బహుమతి సాధించగా, ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన మామిళ్లపల్లె శ్రీనివాసరెడ్డి ఎడ్ల జతలు 2846 అడుగులు లాగి మూడో బహుమతి గెలుచుకున్నాయి. సీఎస్‌పురం మండలం చర్నాపల్లె గ్రామానికి చెందిన కామనబోయిన వెంకటాద్రి ఎడ్ల జతలు 2750 అడుగులు లాగి నాల్గవ బహుమతిని సాధించగా, రాచర్ల మండలం కుంటకాడిపల్లె గ్రామానికి చెందిన దండూరి శ్రీరాములు ఎడ్ల జతలు 2750 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. ఎడ్ల పోటీల్లో విజేతలైన ఎడ్లజతల యజమానులకు వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.4 వేలు, రూ.4 వేలను అందజేశారు.

సిట్ కేసులో లోతైన దర్యాప్తు చేపట్టాలి

- నకిలీ పత్రాలు, స్టాంపుల ఫోర్జరీ కేసుల్లో ఎవరున్నారో తేల్చండి
- ఎస్పీ మలికాగర్గ్ ఆదేశాలు



మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: నకిలీ పత్రాలు, స్టాంపులు, ఫోర్జరీ కేసుల్లో లోతైన దర్యాప్తు చేపట్టాలని ఎస్పీ మలికాగర్గ్ సిట్ బృందాన్ని ఆదేశించారు. ఈమేరకు మంగళవారం రాత్రి సిట్ బృందంతో ఎస్పీ చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన నకిలీ డాక్యుమెంట్లు, రబ్బరుస్టాంపులు, ఫోర్జరీకి సంబంధించి నమోదైన 15 కేసులపై పూర్తిస్థాయి సమాచారాన్ని రాబట్టాలని ఎస్పీ ఆదేశించారు. ఇప్పటి వరకు నమోదైన కేసుల్లో దర్యాప్తు పురోగతి, డాక్యుమెంట్ల సేకరణ, నిందితుల గుర్తింపు, అరెస్టులపై ప్రతి అంశాన్ని వివరంగా సమీక్షించారు. సంబంధిత డాక్యుమెంట్లు, సీడీ ఫైళ్ల క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సిట్ కేసుల్లో ప్రాంతాల వారీగా నకిలీ డాక్యుమెంట్ల గుర్తింపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేసులకు సంబంధించిన ఆధారాల సేకరణలో పోలీస్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల సమన్వయం ప్రధానంగా ఉండాలన్నారు. ఇళ్ల స్థలాలు, ప్లాట్లు, వ్యవసాయ భూములపై రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, డీకే పట్టాలు, బర్త్, డెత్ సర్టిఫికెట్లు, ఈసీలకు సంబంధించిన ఇతర పత్రాల సేకరణలో జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో సిట్ అధికారులు ఏఎస్పీ అడ్మిన్ కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ క్రైం ఎస్‌వీ శ్రీధర్‌రావు, ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, కనిగిరి డీఎస్పీ రామరాజు, సిట్ బృందంలోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

జ్యోతలివే.. జగజ్జననీ



లక్ష్మీనరసింహస్వామి కళారం నగరోత్సవం



కళారం నగరోత్సవంలో భూతకోల ప్రదర్శిస్తున్న కళాకారులు

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు జిల్లాలో కన్నుల పండువగా ముగిశాయి. శక్తిరూపిణి అయిన ఆ జగజ్జననిని నవరాత్రులలో రోజుకో మూర్తిగా అలంకరించి అర్చించారు. విజయదశమి పర్వదినాన పార్వేట ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఒంగోలులో కళారాల ఉత్సవం అంబరాన్నంటింది.

- ఒంగోలు మెట్రో



మస్తాన్‌దర్గా సెంటర్‌లో మూడు కళారాలు నగరోత్సవం, తరలివచ్చిన ప్రజలు





కళారం నగరోత్సవంలో కళాకారుల విన్యాసాలు

అన్నదాతకు దన్ను..

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని పండగ చేసింది. అన్నదాతలకు అండగా నిలుస్తూ పలు సంక్షేమ పథకాలు అందజేస్తోంది. క్రమం తప్పకుండా పెట్టుబడి సాయాన్ని అందించడమే కాకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తూ ప్రోత్సహిస్తోంది. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేసుకుంటున్నారు. మరో వైపు ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో రైతన్నల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- పలు పంటలకు మద్దతు ధర పెంపు
- ఖరీఫ్‌లో రైతుకు తీపి కబురు
- రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట



కోత మిషన్ ద్వారా కోస్తున్న వరి

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 3,55,132 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. 1,32,592 లక్షల ఎకరాల్లో కంది, 78,550 ఎకరాల్లో మిరప, 20,260 ఎకరాల్లో వరి, 11,870 ఎకరాల్లో సజ్జ, 52,852 ఎకరాల్లో పత్తి, 9205 ఎకరాల్లో జొన్న, 49,803 ఎకరాల్లో రాగి, మినుము



సజ్జ రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

సాగు చేస్తున్నారు. నైరుతీ రుతు పవనాలు సరిగ్గా విస్తరించకపోవడంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. ఫలితంగా సాగు విస్తీర్ణం కొంత మేరకు తగ్గింది.

రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు

జిల్లాలో 36 మండలాల్లో 616 రైతు భరోసా కేంద్రాలున్నాయి. వీటిల్లో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించారు. గత సీజన్‌లో వ్యవసాయ, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ సమన్వయంతో పనిచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతుగా నిలవటంతో దళారులు ధరలు తగ్గించటానికి అవకాశం లేకపోయింది. దీంతో రైతులు తాము పండించిన పంటను మంచి ధరలకు అమ్ముకున్నారు.

మద్దతు ధర పెంపు ఇలా..

ధాన్యం మద్దతు ధరను ప్రభుత్వం క్వింటాలుకు రూ.143 పెంచింది. గత ఏడాది సాధారణ రకం ధాన్యం క్వింటాలు రూ.2040కి, గ్రేడ్‌ఏ రూ.2060కి కొనుగోలు చేసింది. ఈ ఏడాది సాధారణ రకం క్వింటాలు ధర రూ.2,183, గ్రేడ్–ఏ రకానికి రూ.2203 చొప్పున పెంచుతూ నిర్ణయించింది. సజ్జలు రూ.2350 నుంచి రూ.2,500, రాగులు రూ.3,578 నుంచి రూ.3,846, కందులు రూ.6,600 నుంచి రూ.7000 వరకు, పెసలు రూ.7,755 నుంచి రూ.8,558, మినుములు రూ.6,600 నుంచి రూ.6,950, జొన్న రూ.2970 నుంచి రూ.3180 వరకు పెంచారు. జొన్న, సజ్జ, రాగి, కాటన్, పొద్దుతిరుగుడు, వేరుశనగ, ఇతర పంటలకు కూడా మద్దతు ధర పెరిగింది. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించేలా జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు. ఈ క్రాప్ పంట నమోదు వివరాలు ఇప్పటికే ప్రకటించారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



రైతులకు మద్దతు ధరలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించటం, మద్దతు ధర కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో రైతులకు పూర్తి అవగాహనతో వారి పంట ఉత్పత్తులు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం మద్దతు ధర పెంచటంతో రైతులకు మరింత ప్రోత్సాహకంగా ఉంటుంది. వ్యవసాయాధికారులు కూడా వారి పరిధిలో మద్దతు ధరలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి, ఒంగోలు

రైతులు అవగాహనతో ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు



రైతులు ఆర్బీకేలు వచ్చిన తర్వాత ప్రతి విషయాన్ని గమనిస్తూ విచారిస్తున్నారు. మద్దతు ధర పెంపుతో రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. పెరిగిన కూలీల దృష్ట్యా రైతులకు మద్దతు ధర పెంచటంతో కొంత మేలు జరుగుతోంది.

– ఐ.వెంకటరెడ్డి, తాళ్లూరు

ఉల్లికి పాట్లు

- అమాంతం పెరిగిన ధరలు.. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.47
- స్థానిక పంట దెబ్బతినటమే కారణం



హోల్‌సేల్ దుకాణంలో తక్కువగా ఉన్న ఉల్లి దిగుమతులు

ఒంగోలు సెంట్రల్: కొండెక్కిన ఉల్లి ధర సామాన్యులకు భారమైంది. ఒక్కసారిగా అమాంతం పెరగడంతో ఉలికిపాటుకు గురి చేస్తోంది. పది రోజుల కిందట వరకు జిల్లాలో కిలో ఉల్లిపాయలు రూ.20 నుంచి రూ.25 వరకూ ధర పలికేవి. ఈ ధర క్రమేపీ పెరుగుతూ ఇప్పుడు రూ.47కి చేరింది. జిల్లాకు ఏడాదిలో ప్రధానంగా రెండు దశలుగా రెండు ప్రాంతాల నుంచి ఉల్లిపాయలు దిగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లా నుంచి ఉల్లి ఉత్పత్తులు (లోకల్ పంట) దిగుమతి అవుతాయి. ఆ జిల్లాలో పంట ఉత్పత్తి అయ్యే సరికి మహారాష్ట్ర షోలాపూర్ నుంచి దిగుమతి ఊపందుకోవడం ఆనవాయితీ. ఈ రెండు సీజన్లకు మధ్య బెంగళూరు నుంచి కొద్ది రోజుల పాటు ఉల్లిని దిగుమతి చేసుకుంటారు. అయితే ప్రస్తుతం లోకల్ పంటగా కర్నూలు జిల్లాలో ఉల్లి పంట దెబ్బతినడంతో ఇప్పుడు ఆ జిల్లా నుంచి పూర్తిగా దిగుమతులు ఆగిపోయాయి. దీంతో జిల్లాలోని వ్యాపారులు మహారాష్ట్ర, ఇతర ఉత్తరాది రాష్ట్రాల ఉల్లిపాయలు గత్యంతరం లేక దిగుమతి చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే రవాణా చార్జీలతో పాటు ఉల్లికి డిమాండ్ పెరగటంతో సహజంగా ధరలపై ప్రభావం పడింది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉల్లి మాత్రమే జిల్లాలోని ఉల్లిపాయల దుకాణాలు, కిరాణా దుకాణాల్లో లభ్యమవుతుంది. ప్రస్తుతం ఈ ధర రూ.40 నుంచి రూ.47 వరకు పలుకుతుంది. మొదటి శ్రేణిరకం ధర రూ.47గా ఉంటోంది. ఈ ధర మరి కొన్ని రోజుల వరకు పది నుంచి రూ.15 వరకు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలో దాదాపు 175 టన్నుల వరకు ఉల్లిపాయలు దిగుమతి అవుతున్నాయి.

ఉత్సాహంగా మాగుంట ప్రకాశం క్రికెట్ లీగ్ పోటీలు

ఒంగోలు: మాగుంట యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రకాశం క్రికెట్ లీగ్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మొత్తం ఆరు మ్యాచ్‌లు నిర్వహించారు. తొలి మ్యాచ్ డీబీసీసీ- ఎంఎం రైడర్స్ జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన డీబీసీసీ జట్టు నిర్ణీత 8 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 98 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎంఎం రైడర్స్ జట్టు నిర్ణీత 8 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 37 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో డీబీసీసీ జట్టు 61 పరుగుల ఆధిక్యంతో జయకేతనం ఎగురవేసింది. రెండో మ్యాచ్ సిరి హాస్పిటల్- రైజింగ్ స్టార్స్ జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన సిరి హాస్పిటల్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన రైజింగ్ స్టార్స్ జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసే సరికి 4 వికెట్లు కోల్పోయి 63 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో సిరి హాస్పిటల్స్ జట్టు 33 పరుగులతో విజయం సాధించింది. మూడో మ్యాచ్ ఎస్ఆర్‌సీసీ–నోకియా కేర్ జట్ల మధ్య జరిగింది. ఎస్ఆర్‌సీసీ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 57 పరుగులు చేయగా తదుపరి బ్యాటింగ్‌కు దిగిన నోకియా కేర్ జట్టు నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 54 పరుగులు మాత్రమే చేసింది. చివరి బంతి వరకు టెన్షన్ క్రీడాభిమానుల్లో నింపిన మ్యాచ్‌గా ఇది నిలిచింది. నాలుగో మ్యాచ్ కింగ్స్ ఎలెవన్-ఏసీసీ పుల్లయ్య జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన కింగ్స్ ఎలెవన్ జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 41 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఏసీసీ పుల్లయ్య జట్టు కేవలం 5 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 44 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. 5వ మ్యాచ్ సాయివర్షిత్ హాస్పిటల్-వెంకటేశ్వర కాలనీ జట్ల మధ్య జరిగింది. నిర్ణీత ఓవర్లలో సాయి వర్షిత్ హాస్పిటల్ జట్టు 6 వికెట్లు కోల్పోయి 40 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెంకటేశ్వర కాలనీ జట్టు 5.5 ఓవర్లలో ఒక్క వికెట్ నష్టపోకుండా 42 పరుగులతో జయకేతనం ఎగురవేసింది. సోమవారం చివరి మ్యాచ్ యువ ఎలెవన్-ట్రిపుల్ ఎస్ కొత్తపట్నం జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన యువ ఎలెవన్ జట్టు నిర్ణీత ఓవర్లలో 59 పరుగులు చేయగా, అనంతరం బరిలోకి దిగిన ట్రిపుల్ ఎస్ కొత్తపట్నం జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి కేవలం 39 పరుగులు మాత్రమే చేసింది. దీంతో యువ ఎలెవన్ జట్టు 20 పరుగులతో విజయాన్ని సొంతం చేసుకుంది.

ఎగసిన అగ్నికీలలు



మంటలు ఆర్పుతున్న ఫైర్ ఇంజన్, వెనుక పైభాగంలో మంటల వల్ల వస్తున్న పొగలు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఒంగోలు వన్‌టౌన్ సీఐ ఎం.లక్ష్మణ్



ఎగిసి పడుతున్న మంటలు

- ఒంగోలు నగరంలోని పప్పుబజారులో సునీల్ కాయిర్ రోప్ మర్చంట్స్‌లో అగ్నిప్రమాదం
- ప్లాస్టిక్ పట్టలు, మోకులు, తాళ్లు, నవార్లుతో పాటు అనేక ప్లాస్టిక్ వస్తువులు మంటల్లో ఆహుతి
- అగ్నిప్రమాదంలో భవనం కూలిపోయే ప్రమాదం
- నిరంతరాయంగా మంటలు ఆర్పుతున్న 8 ఫైరింజన్లు
- పక్క భవనాలకు వ్యాపించకుండా చర్యలు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని గాంధీ రోడ్డు సమీపంలో పప్పు బజారులో ఉన్న సునీల్ కాయిర్ రోప్ మర్చంట్స్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. మంగళవారం తెల్లవారుజామున సునీల్ కాయర్ రోప్ మర్చంట్స్ గోడౌన్‌లో మంటలు వ్యాపించాయి. దీంతో ఒంగోలు అగ్నిమాపక శాఖ అధికారులు తెల్లవారు జాము నుంచి మంటలు ఆర్పే పనిలో నిమగ్నమయ్యారు. అర్ధరాత్రి వరకు కూడా మంటలు అదుపులోకి రాలేదు. సునీల్ కాయర్ రోప్ మర్చంట్స్‌లో ప్లాస్టిక్ పట్టలు, చిన్న సైజు నుంచి పెద్ద సైజు వరకు మోకులు, అన్ని రకాల తాళ్లు, నవార్లు, లారీలకు..ట్రాన్స్‌పోర్టు వాహనాలకు కట్టే పట్టలతో పాటు అనేక రకాల ప్లాస్టిక్ వస్తువులకు సంబంధించి హోల్ సేల్ గోడౌన్ ఉంది. ఈ గోడౌన్‌లో నిప్పు అంటుకోవడంతో ప్రమాదం భారీగా సంభవించింది. పెద్ద గోడౌన్ కావటంతో పాటు ఫైర్ ఇంజన్లు దగ్గరకు వెళ్లి ఆర్పే పరిస్థితి లేకపోవటంతో మంటలను ఆర్పటం అగ్నిమాపక సిబ్బందికి కష్టతరంగా మారింది. భవనంలో ఎక్కువ మొత్తంలో స్టాకు ఉండటంతో పాటు 100 నుంచి 150 అడుగుల వరకు గోడౌన్ లోతు ఉండటం కూడా ఇందుకు ప్రధాన కారణం. దాదాపు 8కి పైగా ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పే పనిలో నిమగ్నమయ్యాయి. మంగళవారం తెల్లవారు జామున 4 గంటలకు మొదలైన మంటలు అర్ధరాత్రి వరకు కూడా గోడౌన్‌లో మంటలు అదుపులోకి రాలేదు. దాదాపు 20 గంటలకు పైగా మంటలు దట్టంగా వ్యాపిస్తూనే ఉన్నాయి. భారీగా స్టాక్ ఉండటంతో మంటలు అదుపులోకి రావటం లేదు. దానికి తోడు ఇరుకు సందులు కావటంతో ఫైర్ ఇంజన్లు తిరగటానికి చాలా ఇబ్బందులు పడుతూ పక్క భవనాలకు మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మంటల్లో గోడౌన్‌కు సంబంధించిన భవనం పూర్తిగా దెబ్బతినింది. కూలిపోయే ప్రమాదం కూడా ఉన్నట్లు అగ్నిమాపక శాఖ అధికారులు అనుమానిస్తున్నారు. అయితే మంటల ప్రభావం పక్కన ఉన్న భవనాలకు వ్యాపించకుండా చేయటంతో పాటు పక్కన ఉన్న వారి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అగ్నిమాపక శాఖ అధికారులు జాగ్రత్తలు పడుతున్నారు. అగ్ని ప్రమాదం దసరా సందర్భంగా తెల్లవారు జామున కాల్చిన బాణా సంచావల్ల జరిగిందా లేక విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల జరిగిందా అన్నది ఇంకా నిర్ధారణ కాలేదు. జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాస రెడ్డి తన సిబ్బందితో మంటలు ఆర్పే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ కావటంతో వేడిని పెంచుతుందని, అందువల్ల పక్కకు వ్యాపించకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. గోడౌన్‌లో స్టాక్ దాదాపు రూ.2 కోట్ల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. గోడౌన్ యజమాని కొమ్మిశెట్టి సునీల్‌కు సంబంధించిందని వివరించారు.

విద్యుత్ అంతరాయం..

సునీల్ కాయర్ రోప్ మర్చంట్స్‌లో అగ్నిప్రమాదం సంభవించటంతో పప్పు బజారుతో పాటు గాంధీ రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక శాఖ సిబ్బంది ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు ప్రమాదం సంభవించిన పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేశారు.

అంగరంగ వైభవంగా దసరా నవరాత్రులు



త్రిపురాంతకంలో పూర్ణాహుతి ఇస్తున్న వేదపండితులు

- పూర్ణాహుతితో ముగిసిన ఉత్సవాలు

త్రిపురాంతకం: బాలాత్రిపురసుందరీదేవి, పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయంలలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పూర్ణాహుతి కార్యక్రమంతో ఉత్సవాలు ముగిసాయి. పది రోజులుగా నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి రోజు భక్తులచే కుంకుమార్చనలు, అభిషేకాలు, ఉభయదాతల పూజలు, బాలపూజ, సుహాసిని పూజ, గోపూజ, చండీహోమం వేదపండితులచే ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రతి రోజు వాహన సేవ ఆలయ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తులచే అర్చకులు ప్రసాదశర్మ, విశ్వనారాయణశాస్త్రిలు పూజలు జరిపించగా, ఈఓ చెన్నకేశవరెడ్డి భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు. విజయదశమి రోజున పూర్ణాహుతి సందర్భంగా ఆలయంలో బలిహరణ, కుంభం, కూష్మాండబలి, కలశ ఉద్వాసన, కలశ సంప్రోక్షణ ప్రత్యేక పూజలు జరిపించి మహాదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. పెద్దసంఖ్యలో పూర్ణాహుతిలో భక్తులు పాల్గొన్నారు.



త్రిపురాంతకం అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తజనులు

క్లుప్తంగా

పలకల గనిలో కార్మికుడు దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర నాయక్

మార్కాపురం రూరల్: పలకల గనిలో పలకల రాయిపడి కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని రాయవరం సమీపంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రాయవరం గ్రామానికి చెందిన ఉప్పు మల్లి కార్జున్ (40) పలకల గనిలో పనిచేస్తుండగా ఒక్కసారిగా పలకల దరిలో ఉన్న రాతిపార పగిలి మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో మరో ముగ్గురు కార్మికులు ఉన్నా వారికి ఎటువంటి గాయాలు కాలేదు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మార్కాపురం రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వరనాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయురాలి మృతి

- మృతురాలు ఏపీ మంత్రి సురేష్ సోదరి

టేకులపల్లి: తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బొమ్మనపల్లి ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు, ఏపీ మంత్రి ఆదిమూలపు సురేష్ సోదరి శైలజ (58) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమె భర్త అబ్రహం పాల్వంచ డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. 1998లో ఉద్యోగంలో చేరిన శైలజ టేకులపల్లి మండలంలో పలు పాఠశాలల్లో పనిచేసి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా, రిసోర్స్ పర్సన్‌గా మన్ననలు పొందారు. మూడేళ్లలో ఉద్యోగ విరమణ చేయనుండగా ఆకస్మికంగా మృతి చెందారు. కొత్తగూడెం విద్యానగర్ కాలనీ నుంచి మృతదేహాన్ని ఆమె స్వగ్రామమైన ప్రకాశం జిల్లా మార్కాపురానికి తరలించారు. శైలజ ఏపీ మంత్రి ఆదిమూలపు సురేష్‌కు స్వయానా సోదరి.

కరువు సహాయక చర్యలు తీసుకోవాలి

ఒంగోలు టౌన్: జిల్లాలో కరువు సహాయక చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సుందరయ్య భవన్లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఉయన మాట్లాడారు. తాగునీటి సమస్య తీర్చాలని, తాగునీటి కోసం కేటాయించిన 5 టీఎంసీలు సరిపోయే పరిస్థితి లేదని చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల రూపాయలు పరిహారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పూనాటి ఆంజనేయులు, జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

120 ప్రత్యేక సర్వీసు బస్సుల ఏర్పాటు

ఒంగోలు సెంట్రల్: విజయ దశమి సందర్భంగా జిల్లా నుంచి హైదరాబాద్, అక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు పండుగ నిమిత్తం ప్రయాణికుల రాక కోసం 120 సాధారణ సర్వీసు బస్సులు ఏర్పాటు చేశామని ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి బి.సుధాకర్ తెలిపారు. ఆయా సర్వీసుల ద్వారా 7500 మంది ఉపయోగించుకుని ప్రయాణించారని చెప్పారు. తిరుగు ప్రయాణం నిమిత్తం ప్రయాణికుల అవసరాలను బట్టి అదనపు సర్వీసులు సాధారణ చార్జీలతో నడుపుతారని తెలిపారు. ప్రయాణికులు ఉపయోగించుకుని ఏపీఎస్ ఆర్టీసీని ఆదరించాలని విన్నవించారు.

విజయానికి చిహ్నం విజయ దశమి





ఆయుధ కారాగారంలో పూజలు చేస్తున్న ఎస్పీ మలికాగర్గ్ దంపతులు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు

- అన్ని రంగాల్లో విజయం చేకూరాలని ఆకాంక్ష
- ఆయుధ పూజలో ఎస్పీ మలికా గర్గ్, ఆమె భర్త, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్

ఒంగోలు సబర్బన్: విజయానికి చిహ్నం విజయ దశమి అని ఎస్పీ మలికా గర్గ్ అన్నారు. విజయ దశమిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని ఏఆర్ ప్రధాన కార్యాలయంలో ఆయుధ పూజ చేశారు. తన భర్త, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఎస్పీ మలికా గర్గ్ ఆయుధ పూజ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ దంపతులు మాట్లాడుతూ విజయ దశమి రోజు ప్రత్యేకంగా పూజలు చేయడం సంప్రదాయంగా వస్తోందన్నారు. పోలీసులు అన్ని విషయాల్లో విజయవంతంగా ముందుకు సాగాలని కోరారు. దుర్గామాత ఆశీస్సులు పోలీసులకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణగా చెడుపై విజయానికి ప్రతీకగా జరుపుకునే పర్వదినం విజయ దశమి అన్నారు. ఆయుధ పూజలు పోలీసులు రోజు వారీ వినియోగించే ఆయుధాలతో పాటు మోటారు ట్రాన్స్‌పోర్టు విభాగంలోని వివిధ రకాల పోలీసు వాహనాలకు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకుండా ఉండాలని ప్రత్యేకంగా పూజలు చేశారు. శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గామాత సమక్షంలో మన జీవనానికి అవసరమైన వ్యవసాయ పనిముట్లు, వస్తువులు, ఆయుధాలు దైవంగా భావిస్తూ పూజించటం కృతజ్ఞతా భావాన్ని సూచిస్తుందన్నారు. ప్రతి ఆయుధం తనదైన శక్తిగా కలిగి ఉంటుందన్నారు. ఆయుధ పూజ అనేది భద్రతా దళాలకు అత్యంత ముఖ్యమైన పండగని గుర్తు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ లేకుండా వ్యవహరించాలని, అన్ని విషయాల్లో విజయవంతంగా ముందుకు సాగుతూ జిల్లా పోలీస్ శాఖ మంచి పేరు ప్రతిష్టలు సాధించాలని ఆశిస్తున్నట్లు ఎస్పీ మలికా గర్గ్ పేర్కొన్నారు. ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డితో పాటు పోలీస్, ఏఆర్ అధికారులు పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం

- వైఎస్సార్–బీఎస్సార్ మెగా క్రికెట్ విజేతలకు బహుమతులు

దర్శి: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కోస్టల్ రైడర్స్ టీం ఓనర్, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. విజయ దశమి పండగ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వైఎస్సార్–బీఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. అందులో భాగంగా మొదటి బహుమతి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి రూ.111116 నగదు ఫైనల్ విజేత గణేష్ వారియర్స్‌కు అందజేయగా ద్వితీయ బహుమతి విజేత చందు లెవెన్స్‌కు సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు, బసిరెడ్డి పల్లె సర్పంచ్ కేసరి రాంభూపాల్‌రెడ్డి రూ.60 వేల నగదు బహుమతి అందజేశారు. తృతీయ బహుమతి అంజి పాంతర్స్‌కు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కేవీరెడ్డి రూ.40 వేలు, నాలుగో బహుమతి సింహ లెవెన్స్‌కు తాళ్లూరు మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి రూ.20 వేలు అందజేశారు. టోర్నమెంట్ షీల్డ్‌ను సారెడ్డి సుధాకర్‌రెడ్డి అందజేశారు. బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. క్రీడల్లో గెలుపొందిన వారికి అభినందనలు తెలిపారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌ఎం బాషా, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, మాజీ దొనకొండ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, సోషల్ మీడియా కో కన్వీనర్ యరమల మధుసూదన్‌రెడ్డి, సందిరెడ్డి రాజశేఖరరెడ్డి, మేకల కృష్ణారెడ్డి, వాకా స్వరూప్‌రెడ్డి, కాసు శ్రీనివాసరెడ్డి, వెన్నపూస బాపిరెడ్డి, చంద్రగిరి గురవారెడ్డి, బంకా నాగిరెడ్డి, కొల్లా భాస్కర్, పానుగంటి కోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరణం వెంకటేష్‌కు పరామర్శల వెల్లువ



వెంకటేష్‌తో మాట్లాడుతున్న మంత్రి సురేష్, పక్కన ఎమ్మెల్యే కరణం బలరాం



వెంకటేష్‌ను పరామర్శిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

చీరాల టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ యశోద హాస్పిటల్లో చికిత్స పొందుతున్న చీరాల నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను మంగళవారం పలువురు రాజకీయ పార్టీల నేతలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పరామర్శించారు. చీరాల మండలం బోయినవారిపాలెంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వెంకటేష్‌ను ఆటో ఢీకొట్టడంతో గాయపడిన విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు ఒంగోలులోని సంఘమిత్ర హాస్పిటల్లో చికిత్స అనంతరం శస్త్రచికిత్స కోసం వెంకటేష్ తండ్రి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి హైదరాబాద్ యశోద హాస్పిటల్‌కు తరలించారు. యశోద హాస్పిటల్లో చికిత్స పొందుతున్న కరణం వెంకటేష్‌ను మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు శిద్దా సుధీర్‌బాబు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గుంటుపల్లి హైమా సుబ్బారావు, పలువురు నాయకులు పరామర్శించారు.

పూరిల్లు దగ్ధం

గుండమాల (కొత్తపట్నం): ఒంటరిగా జీవనం సాగిస్తున్న మహిళ పూరిల్లు దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని గుండమాలలో మంగళవారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన సింగోతు చేజర్లమ్మ ఒంటరిగా పూరింట్లో నివాసం ఉంటోంది. ఉదయం పనిపై బయటకు వెళ్లింది. అర గంటలో పనులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి పూరిల్లు కాలిబూడిదైంది. ఇంట్లో రూ.7 వేల విలువ చేసే బంగారు వస్తువులు, రూ.4,900 నగదు, గ్యాస్ పొయ్యి, గ్యాస్ సిలిండర్, టేబుల్ ఫ్యాన్, కుక్కర్, టీవీ, వంట సామగ్రి, బట్టలు కాలి బూడిదయ్యాయి. వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని అంచన వేస్తున్నారు. వీఆర్వో బోస్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రిపోర్టు తహసీల్దార్ బీవీ రమణారావుకు అందజేశారు. సంఘటన స్థలానికి సర్పంచ్ కారాని జయరావు చేరుకుని బాధితురాలిని పరామర్శించారు. సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంటోంది.



కాలి బూడిదైన పూరింటి వద్ద బాధితురాలు

32 ఏళ్ల తర్వాత మధురానుభూతులతో..



ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

కారంచేడు: ఏరా.. ఎలాగున్నావ్. ఏం చేస్తున్నావ్, ఎక్కడున్నావు.. మీ కుటుంబం బాగుందా..అంటూ ఆత్మీయ పలకరింపులు. ఎప్పుడో చిన్నప్పుడు కలిసి చదువుకున్న మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఒకరికొకరు పంచుకున్నారు స్నేహితులు. మండల కేంద్రమైన కారంచేడులో యార్లగడ్డ నాయుడమ్మ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 1991 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 32 ఏళ్ల తర్వాత పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. దసరా సెలవులను పురస్కరించుకొని తాము చదివిన పాఠశాలలో కలుసుకోవడానికి నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే సోమవారం పాఠశాలలో చేరి వారు చిన్నప్పుడు చేసిన అల్లరి, పోటీలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు కుటుంబాలను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులను సత్కరించుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఆనందభాష్పాలను రాల్చుకున్నారు. ఆత్మీయ విందును ఏర్పాటు చేసుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకొని మళ్లీ వీడ్కోలు పలికారు.

అభిమానుల మధ్య ఎమ్మెల్యే టీజేఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఒంగోలులోని తన కార్యాలయం వద్ద అభిమానులతో కలిసి ఉత్సాహంగా జరుపుకున్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిల సమక్షంలో ఎమ్మెల్యే టీజేఆర్ తన సతీమణి వనజ, కుటుంబ సభ్యులతో కలిసి కేకు కట్ చేశారు. బూచేపల్లి వెంకాయమ్మ ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే టీజేఆర్‌పై సినీ రచయిత సుద్దాల అశోక్‌తేజ, మణిశర్మ కాంబినేషన్‌లో రూపొందించిన గీతాన్ని బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, మండల కన్వీనర్‌లు పోలవరపు శ్రీమన్నారాయణ, మండవ అప్పారావు, దుంపా చెంచిరెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీలు వాకా అరుణ, బి.విజయ, యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు దుంపా రమణమ్మ, వేమా శ్రీనివాసరావు, చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

- రూ.4 లక్షల నగదు, 55 గ్రాముల బంగారం మాయం



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐలు కోటేశ్వరరావు, సువర్ణ

మార్కాపురం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎస్‌ఎస్ నగర్‌లో నివాసం ఉంటున్న అర్ధవీడు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గోపాల్‌రాజు ఇంట్లో భారీ దొంగతనం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గోపాలరాజు డ్యూటీ కోసం అర్ధవీడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా కుటుంబ సభ్యులు దసర పండగ సందర్భంగా బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదేఅదనుగా భావించిన దొంగలు ఆదివారం అర్ధరాత్రి తాళం పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న రూ.4 లక్షల నగదు, 55 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకెళ్లారు. సోమవారం ఉదయం డ్యూటీ ముగించుకుని గోపాలరాజు ఇంటికి రాగా తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో సామగ్రి చిందరవందరగా పడి ఉండటంతో పాటు బీరువాలో ఉన్న నగదు, ఆభరణాలు కనిపించలేదు. సమాచారాన్ని పట్టణ పోలీసుస్టేషన్‌కు తెలపడంతో ఎస్‌ఐలు కోటేశ్వరరావు, సువర్ణ చోరీ జరిగిన గృహాన్ని పరిశీలించి క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. సీసీ టీవీ పుటేజ్‌ను పరిశీలిస్తున్నారు.

దొరికినట్టే దొరికి..

దొంగతనం జరిగిన ఇంటికి సమీపంలో ఒక వ్యక్తి సెల్ టార్చిలైట్ వేసి చూస్తుండగా అదే సమయంలో ఎస్‌ఎస్ నగర్‌కు చెందిన వ్యక్తి అనుమానించి టార్చిలైట్ వేసిన వ్యక్తిని గట్టిగా పట్టుకున్నాడు. ఇద్దరి మధ్య జరిగిన పెనుగులాటలో తప్పించుకుని వెళ్లాడు. వెంటనే డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వేగంగా స్పందించి ఉంటే అనుమానితుడు దొరికి ఉండేవాడని పలువురు భావిస్తున్నారు. ఎస్‌ఎస్ నగర్‌లో పట్టణ ప్రముఖులతో పాటు పట్టణ, రూరల్, పెద్దారవీడు, కంభం, అర్ధవీడుకు చెందిన పోలీసులు నివాసం ఉంటున్నారు.

ఆలయ పూజారి ఇంట్లో బంగారం, వెండి చోరీ



ఆలయంలో హుండీ పగులగొట్టిన దొంగలు



వెంకటరామాచార్యులు ఇంట్లో ఇలా..

- 8 సవర్ల బంగారం, 250 గ్రాముల వెండి మాయం
- మరో ఆలయంలో హుండీ దోపిడీ
- పండుగ పూట పేట్రేగిన దొంగలు

యద్దనపూడి: దసరా పండుగ సందర్భంగా దొంగలు రెచ్చిపోయారు. సోమవారం మండల కేంద్రం యద్దనపూడిలో ఒక ఆలయంలో హుండీ, మరో ఆలయంలో పూజారి ఇంట్లో దొంగలు పడి బంగారం, వెండి వస్తువులు దొంగతనం చేశారు. యద్దనపూడిలోని వేణుగోపాలస్వామి ఆలయంలోని పూజారి పరుచూరి వెంకటరామాచార్యులు ఇంట్లో కూడా దొంగలు చోరీకి పాల్పడ్డారు. కొంతకాలంగా వెంకటరామాచార్యులకు అనారోగ్యంగా ఉండటంతో హైదరాబాద్‌లో కుమార్తె వద్ద ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి పూజారి ఇంటి తలుపులు పగులగొట్టి 8 సవర్ల బంగారం, 250 గ్రాముల వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు వెంకటరామాచార్యులు, కుమారుడు వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగశ్రీను తెలిపారు. మొత్తం రూ.2 లక్షల విలువ ఉంటుందని పూజారి తెలిపాడు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ చోరీ

భక్తుల కష్టాలను తీర్చే కలియుగదైవం వెంకటేశ్వరస్వామి ఆలయంలోనే దొంగలు చోరీకి తెగబడ్డారు. మండల కేంద్రం యద్దనపూడిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు ఆలయంలోకి చొరబడి హుండీ పగులగొట్టి అందులోని సుమారు రూ.5 వేలు నగదు ఎత్తుకెళ్లారు. రోజూ మాదిరిగానే పూజా కైంకర్యాల కోసం ఆలయానికి వచ్చిన పూజారి హుండీ పగులకొట్టడం చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు.



సినిమా టైటిల్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సినిమా టైటిల్ ఆవిష్కరణ

కందుకూరు: శ్రీ కళాధర ప్రొడక్షన్స్ 46 సినిమా బ్యానర్‌లో నూతనంగా నిర్మిస్తున్న 'రామాంతపురం ప్రెసిడెంట్ అల్లుడు' అనే సినిమా టైటిల్‌ని మంగళవారం మలినేని లక్ష్మయ్య ఇంజినీరింగ్ కాలేజీ అధినేత మలినేని లక్ష్మయ్య ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కళాధర ప్రొడక్షన్స్‌లో నిర్మిస్తున్న సినిమా టైటిల్ బాగుందని, చిన్న సినిమాలతో విజయాలు సాధిస్తున్న కందుకూరు ప్రాంతానికి చెందిన యూనిట్‌కు అభినందనలు తెలిపారు. తాను కూడా ఈ సినిమాలో నటిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. చిత్ర నిర్మాణ తోకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విజయ దశమి సందర్భంగా తమ చిత్ర టైటిల్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. జస్టిస్ సినిమా దర్శకుడు సల్మాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారని, కో డైరెక్టర్‌గా రాజు, మ్యూజిక్ డైరెక్టర్‌గా సల్మాన్‌ఖాన్ పనిచేస్తున్నారని చెప్పారు. దర్శకుడు సల్మాన్ మాట్లాడుతూ తాము తీయబోతున్న ఈ నూతన సినిమాలో నటించేందుకు నూతన నటీనటులకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు 9908117056 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సీఎం చౌదరి, శిరోమణి, ఇస్సాక్, రవికుమార్, పల్నాటి చెన్నయ్య, మౌనేష్, సాజిద్, సిద్ధయ్య, వంశీ, బాజి, రమణిదాస్, మధురమణి పాల్గొన్నారు.